94931 70689 www.rajadhanivartalu.com rajadhanivartalu rajadhaniv RNI No. APTEL 2015/ 66622 స్థాపితం : 2015 Postal Regd No: GTR/84/2016-18

**రాష్ట్రాభివృద్ధికి పరిశ్రమలే అత్యంత కీలకం**

– మంత్రి ఎన్.అమరనాథరెడ్డి

- వివరాలు 2లో

# రాజధాని వార్తలు

Voice of Voiceless


| తేదీ | వారం | సహార్ (ఉదయం) | ఇఫ్తార్ (సాయంత్రం) |
|---|---|---|---|
| 16 | బుధ | 04:16 | 07:05 |
| 17 | గురు | 04:15 | 07:05 |
| 18 | శుక్ర | 04:15 | 07:06 |
| 19 | శని | 04:14 | 07:06 |
| 20 | ఆది | 04:13 | 07:07 |



అమరావతి సంపుటి : 3 సంచిక 34, పేజీలు 4 వెల: రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ ' రాజధాని' తొలి తెలుగు వార పత్రిక సోమవారం 14 - ఆదివారం 20 మే, 2018

## కొత్త ఐఏఎస్‌లకు సవాళ్ల స్వాగతం

తమ కలలను సాకారం చేసుకున్నందుకు ఐఏఎస్ టాపర్స్ అంతా సంతోషంలో మునిగిపోయి ఉంటారు. స్నేహితులు, బంధు మిత్రులు, రాజకీయనాయకులు వారిని ప్రశంసించడంతో ఇన్నాళ్ల కష్టమంతా మాయమై వారి మనస్సు దూది పింజంలా గాలిలో తేలుతూ ఉండవచ్చు. అయితే వారి కలలకు, ఆకాంక్షలకు అనుకూలంగా ఉద్యోగాలు నిర్వహించడం అంత తేలికకాదని వారు పోస్టింగులు తీసుకున్న తర్వాత తెలుస్తుంది. ఉద్యోగబాధ్యతలకు సంబంధించిన వాస్తవాలు కఠినంగా



ఉంటాయన్నది మాత్రం నిజం.

దాదాపు ఒక 20 ఏళ్ల క్రిందట ఉద్యోగుల పరిస్థితులు బాగుండేవి. కలెక్టర్ అంటే జనాలకు భక్తితో కూడిన భయం ఉండేది. అంతెందుకు కలెక్టర్ పక్కన ఉండే బిళ్లా బంట్రోతును చూస్తేనే జనాలు భయంతో పక్కకు తొలిగే వాళ్లు. కాని పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. ఎప్పుడైతే రాజకీయ నాయకులు తమ తప్పులకు ఉద్యోగులను బలిపెట్టడం, ప్రజలను ఉద్యోగులపైకి రెచ్చగొట్టడం చేస్తున్నారో ఉద్యోగులకు భద్రత లేకుండా పోయింది. వాస్తవం ఒప్పుకోవాలంటే 25 ఏళ్ల క్రిందట ఉద్యోగుల్లో ఇంత దారుణమైన అవినీతి కూడా లేదు. విలువలను పాటించేవారి సంఖ్య ఎక్కువగా ఉండేది. ప్రస్తుతం అధికార పార్టీలు ఉద్యోగులను కార్యకర్తలను కన్నా దారుణంగా ఉపయోగించుకుంటున్నారు. ఎక్కడకు రావాలంటే

- మిగతా 2 లో



### మాజీ డీజీపీ అల్లుడితో
## మంత్రి అఖిలప్రియ నిశ్చితార్థం

**హైదరాబాద్ :** ఏపీ పర్యాటకశాఖ మంత్రి భూమా అఖిల ప్రియ ఇంట పెళ్లి వేడుక మొదలైంది. మాజీ డీజీపీ సాంబశివరావు అల్లుడు, ప్రముఖ పారిశ్రామిక వేత్త అయిన భార్గవ్‌తో మంత్రి అఖిలప్రియకు నిశ్చితార్థం జరిగింది. హైదరాబాద్‌లోని మంత్రి అఖిల ప్రియ నివాసంలో ఈ శుభకార్యం జరిగింది. ఈ కార్యక్రమం అత్యంత సన్నిహితుల సమక్షంలో జరిగినట్లు తెలుస్తోంది. ఈ నిశ్చితార్థ వేడుకకు ఎమ్మెల్యేలు ఎస్వీ మోహన్‌రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, కుటుంబ సభ్యులు హాజరయ్యారు. వీరి వివాహం ఆగస్టు 29న జరగనుంది.

## కర్ణాటకలో ముగిసిన పోలింగ్

కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. సాయంత్రం 5 గంటల వరకు 64 శాతం పోలింగ్ నమోదయిందని సంబంధిత అధికారులు తెలిపారు. ఆ రాష్ట్రంలోని రామనగర్ జిల్లాలో అత్యధికంగా 84 శాతం పోలింగ్ నమోదుకాగా, బెంగళూరు పట్టణంలో అత్యల్పంగా 44 శాతం నమోదైంది. తమ పార్టీయే విజయం సాధిస్తుందని కాంగ్రెస్, బీజేపీ, జేడీఎస్ నేతలు చెప్పుకుంటున్నారు.




# రాజధాని వార్తలు

కలం

## టెన్షన్..టెన్షన్

కర్ణాటక ఎన్నికల ప్రచార ఘట్టం, పోలింగ్ పూర్తయ్యింది. 224 స్థానాలకు గాను 222 స్థానాలకు ఎన్నికలు జరిగాయి. ఒకస్థానంలో బీజేపీ అభ్యర్థి అకాల మృతి , ఆర్ఆర్‌నగర్‌లో 10 వేల నకిలీ ఓట్లకార్డులు దొరకడంతో ఎన్నిక సంఘం ఆ నియోజక వర్గంలో కూడా పోలింగ్ వాయిదా వేసింది. మే 15న ఎన్నికల ఫలితాలు వెలువడతాయి. దీంతో ఆయా పార్టీల నేతల గుండెలు హైస్పీడుతో కొట్టుకుంటున్నాయి. బీజేపీని నిలువరించడానికి ముఖ్యమంత్రి సిద్ధరామయ్య చేయవలసినదంతా చేశారు.రాహుల్ కూడా ఇదివరకటి కంటే మెరుగ్గానే ఎన్నికల ప్రచారంలో పాల్గొని మాట్లాడగలిగారు. రెండేళ్ల తర్వాత యూపీఏ అధ్యక్షురాలు సోనియాగాంధీ కూడా కర్ణాటక ఎన్నికల్లో పాల్గొని మోడీ ప్రభుత్వాన్ని కడిగి పారేశారు. యడ్యూరప్పను ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించాల్సి రావడం బీజేపీకి మైనస్ పాయింట్‌గా చెప్పక తప్పదు. అవినీతి కేసులో ఆయన జైలుకెళ్లిన విషయం తెలిసిందే. జనతాదళ్ (సెక్యులర్) అధ్యక్షుడు కుమారస్వామి ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ఈ ఎన్నికల్లో విజయం సాధించకపోతే చనిపోతానని ఎన్నికల ముందు తెలపడం ఓటర్లను భావోద్వేగ బ్లాక్ మెయిలింగ్‌కు గురిచేయడమే. ఎన్నికలకు ఒకరోజు ముందు రాష్ట్రంలో అధికార పార్టీ వ్యూహాత్మకంగా గాలిజనార్ధన్ రెడ్డి కేసులను కొట్టేయాల్సిందిగా అప్పటి ప్రధాన న్యాయమూర్తి అల్లుడు శ్రీనిజన్‌కు బేరం పెడుతున్న వీడియోలను విడుదల చేశారు. ఈ ఘటన 2010 జూలై 1న జరిగింది. అక్రమమైనింగ్ కేసు కొట్టివేతకు రూ.160 కోట్లు, మిగిలిన కేసులు కొట్టివేతకు మరో రూ. 340 కోట్లు మొత్తం రూ. 500 కోట్లకు బేరం కుదుర్చుకోవడం ఈ వీడియోల్లో ఉంది. శ్రీనిజన్‌తోపాటు ఓ స్వామిజీ, మరో గనుల వ్యాపారి పూబాలన్ కెప్టెన్ రెడ్డిలు ఉన్న ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తోంది. కన్నడ టీవీ కూడా ఈ దృశ్యాలను ప్రసారం చేసింది. అవినీతి పరులకు ప్రధాని మోడీ కొమ్ముకాస్తున్నారని కాంగ్రెస్ అధినాయకత్వం విమర్శలు కుప్పిస్తుండగా, సోనియా, రాహుల్ గాంధీలపై రూ. 5 వేల కోట్లు అక్రమాలకు పాల్పడ్డారని ప్రధాని మోడీ మండిపడుతున్నారు. ఏది ఏమైనా కర్ణాట ఎన్నికలు మూడు పార్టీలకు ప్రతిష్టాత్మకంగా మారాయి. ఈ మూడు పార్టీలు రెండు బలమైన కులాలకు టికెట్లు కేటాయించాయి. దక్షిణ కర్ణాటకాలో వక్కలిగలకు, ఉత్తర కర్ణాటకలో ప్రాబల్యం కలిగిన లింగాయత్‌లకు 45 శాతం టికెట్లు కేటాయించారు. ఈరెండు కులాలు కలిపి రాష్ట్ర జనాభాలో 31 శాతం మాత్రమే ఉన్నారు. అయితే దక్కిన సీట్లు 279. గెలిచే అభ్యర్థుల పేరుతో అగ్రకులాలకే సీట్లు కట్టబెట్టారని ఓబీసీలు విమర్శిస్తున్నారు. సైన్యంలో ముథోళ్ జాతి కుక్కలు చేస్తున్న సేవలు చూసి నేర్చుకోవాలని, ప్రధాని అనడం ప్రజలను అవమాన పరచడమే. దేశ ఆర్థిక వ్యవస్థను నాశనం చేశారని మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ తెలపడం, దీనిపైనే మాజీ ఆర్థిక మంత్రి చిదంబరం వ్యాఖ్యలు చేయడం తెలిసిందే. అలాకాకుండా వారిని ప్రచారసభల్లో ఉపయోగించుకుంటే కాంగ్రెస్‌కు మరింత ప్రయోజనం చేకూరేది.

## రద్దయిన రైలు టికెట్ల నగదు వాపస్

**న్యూఢిల్లీ :** ప్రయాణికులు ఏఖాతా నుంచి టికెట్‌ను బుక్ చేసుకున్నారో దానికే నగదు వాపస్ అవుతుందని' రైల్వే శాఖ ట్వీట్ చేసింది. ఎటువంటి టీడీఆర్‌ను సమర్పించాల్సిన అవసరం ఉండదు. పూర్తి వివరాల కోసం ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్‌ను సంప్రదించాల్సిందిగా సూచించింది. రైలు ప్రయాణికులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా పలు సేవలను రైల్వే శాఖ ప్రవేశపెడుతోంది. అందులో భాగంగా అత్యవసర సందర్భాల్లో చివరి నిమిషంలోనూ తత్కాల్ పద్ధతి ద్వారా టికెట్లను బుక్ చేసుకునే సౌలభ్యం కల్పించింది వేసవికాలంలో అత్యంత రద్దీగా ఉండే రూట్లలో తక్కువ సమయంలోనే తత్కాల్ టికెట్లు బుక్ అవుతున్నాయి. అయితే ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్‌లో తలెత్తే చిన్న చిన్న ఆవాంతరాలు వల్ల టికెట్లను పొందేందుకు ప్రయాణికులు స్వల్పంగా ఇబ్బందిపడుతున్నారు.

## కర్ణాటకలో జోరుగా పోలింగ్

**బెంగళూరు:** కర్ణాటక శాసనసభ ఎన్నికల పోలింగ్‌కు ఉదయం 7 గంటల నుంచే ఓటర్లు బారులు తీరారు. సామాన్య ప్రజలతో పాటు సినీ, రాజకీయ ప్రముఖులు కూడా క్యూలో నిల్చుని తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు. బెంగళూరులో మాజీ క్రికెటర్ అనిల్ కుంబ్లే తన కుటుంబంతో కలిసి వచ్చి ఓటు వేశారు. ఓటు వేసేందుకు క్యూ లైన్‌లో నిల్చున్న ఫోటోను కుంబ్లే తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో షేర్ చేశారు.

ఇక మరో క్రికెటర్ రాహుల్ ద్రవిడ్ కూడా ఈ ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించుకున్నారు. కన్నడ నటులు రమేశ్ అరవింద్, రవిచంద్ర, ప్రముఖ ఆధ్యాత్మిక గురువు శ్రీశ్రీ రవిశంకర్ కూడా ఓటు వేశారు. ఇటీవల కుంబ్లే, రాహుల్ ద్రవిడ్‌లను పార్టీలో చేర్చుకునేందుకు భాజపా ప్రయత్నించినట్లు వార్తలు వచ్చినవిషయం తెలిసిందే. అయితే అందుకు వారు నిరాకరించినట్లు కొన్ని మీడియా వర్గాలువెల్లడించాయి.ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్.. సాయంత్రం6గంటలవరకు కొనసాగుతుంది. మొత్తం 222 స్థానాలకు పోలింగ్ జరుగుతోంది.

## 16న ఏపీ మంత్రిమండలి సమావేశం

**రాజధాని ప్రతినిధి, సచివాలయం :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రి మండలి సమావేశం ఈ నెల 16 తేదీన(బుధవారం) జరగనుంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలో బుధవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి సచివాలయంలో ఒకటో బ్లాక్‌లోఉన్నకేబినెట్ మీటింగ్ హాల్‌లో మంత్రి మండలి సమావేశం ప్రారంభం కానున్నట్లు రాష్ట్రప్రభుత్వప్రధాన కార్యదర్శి దినేష్ కుమార్ తెలిపారు.

# ట్రిపుల్ ఐటీ ప్రవేశ ప్రకటన



- జూన్ 8లోగా దరఖాస్తు చేసుకోవాలి
- టెన్త్‌లో గ్రేడింగ్ ఆధారంగా ప్రవేశాలు
- జూన్ 26న ఎంపిక జాబితా
- జూలై మొదటివారంలో ప్రవేశాలు

**విశాఖపట్నం :** గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అత్యున్నత సాంకేతిక విద్యను అందించేలక్ష్యంతో ఏర్పాటు చేసిన రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీ(ఆర్‌జెయూకూకేటీ) పరిధిలో రాష్ట్రంలో ఉన్న ట్రిపున్ ఐటీలు ఈ ఏడాది ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నాయి.

**అడ్మిషన్ల షెడ్యూల్**

ఆర్‌జేయూకేటీ పరిధిలోని నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం, ఇడుపులపాయ మొత్తం నాలుగు ట్రిపుల్ ఐటీలలో ఈ ఏడాది ఆరు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు ఇటీవల షెడ్యూల్ విడుదలయ్యింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. జూన్ 8, దరఖాస్తుల స్వీకరణకు ఆఖరు తేదీగా నిర్ణయించారు. జూన్ 26న ఎంపికైన విద్యార్థుల జాబితా ప్రకటిస్తారు. నూజివీడు, ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీల్లో జూలై 4,5 తేదీలలో, శ్రీకాకుళం, ఒంగోలు ట్రిపుల్ ఐటీల్లో జూలై 6, 7 తేదీలలో అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన జరుపుతారు. జూలై 10 నుంచి 12 వరకు క్యాంపస్ వారీగా అభ్యర్థులకు తమ ప్రవేశాలను మార్చుకునే అవకాశం ఉంటుంది. ప్రత్యేక కేటగిరీ విద్యార్థులకు జూలై 20 నుంచి మూడు రోజుల పాటుసర్టికెట్ల పరిశీలన ఉంటుంది. ప్రవేశాలు పొందిన విద్యార్థులకు ఆయా ట్రిపుల్ ఐటీల్లో కోర్సుపై పూర్తి అవగాహన కలిగేలా ఓరియంటేషన్ ప్రోగ్రామ్ ఉంటుంది.

**4 వేల మందికి ప్రవేశాలు**

రాష్ట్రంలోని నాలుగు ట్రిపుల్ ఐటీలకు ఒకే దరఖాస్తు ఉంటుంది. తమకు నచ్చిన ట్రిపుల్ ఐటీకి ప్రాధాన్యత ఇస్తూ దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ ఏడాది టెన్త్ రెగ్యులర్ విధానంలో ఉత్తీర్ణులైన వారు అర్హులు. టెన్త్‌లో వచ్చిన గ్రేడింగ్ (జీపీఏ) అధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. ప్రతీ మండలంలో ఉన్నవారికి అవకాశం కల్పిస్తారు. నాలుగు ట్రిపుల్ ఐటీల్లోనూ కలిపి 4 వేలమంది విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తారు. ఆయాట్రిపుల్ ఐటీల పరిధిలోని జిల్లాల్లోని వారికి 85 శాతం మందికి మిగిలిన వారికి 15 శాతం మందిని ఎంపిక చేస్తారు. సీట్ల భర్తీ విషయంలో ఎస్సీ-15,ఎస్టీ-6,బీసీ ఎ-7, బీ-10, సీ-1, డీ-7, ఇ-4, వికలాంగులకు-3, సైనికుల పిల్లలకు-2, ఎన్‌సీసీ-1, క్రీడలు-0.5 శాతం వారీగా రిజర్వేషన్లు కల్పిస్తారు. ట్రిపుల్ ఐటీల్లో ఫీజు రీయంబర్స్ మెంట్ కూడా ఉంటుంది. రూ.లక్ష వార్షిక ఆదాయం దాటని వారికి ఈ రీయంబర్స్‌మెంట్ వర్తిస్తుంది.

**ట్రిపుల్ ఐటీల పరిధి, కోర్సులు**

ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ పరిధిలలో కడప, కర్నూలు, అనంతపురం, చిత్తూరు, నెల్లూరు జిల్లాలకు చెందిన వారిని లోకల్‌గా పరిగణిస్తారు. నూజివీడు, శ్రీకాకుళం, ఒంగోలు ట్రిపుల్ ఐటీల్లో శ్రీకాకుళం, విశాఖపట్నం, విజయనగరం, ప్రకాశం, గుంటూరు, కృష్ణా, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన వారిని లోకల్‌గా పరిగణిస్తారు. ట్రిపుల్ ఐటీల్లో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్, సివిల్, కెమికల్, మెకానికల్‌తో పాటు మెటీరియల్ సైన్స్ అండ్ మెటలర్జికల్ కోర్సులు ఉన్నాయి. టెన్త్ తరువాత ఈ ట్రిపుల్ ఐటీల్లో ప్రవేశించి వారికి రెండేళ్ల పాటు బోధించిన గణితం, రసాయన శాస్త్రం, భౌతిక శాస్త్రం సబ్జెక్టులను ప్లస్ టుగా పరిగణిస్తారు. తరువాత నాలుగేళ్లు ఇంజినీరింగ్ మొత్తం ఆరేళ్లు సమీకృత ఇంజినీరింగ్ కోర్సుగా ఉంటుంది. రాష్ట్రంలో నాలుగు చోట్ల మాత్రమే ఉన్న ట్రిపుల్ ఐటీల్లో ప్రవేశానికి రోజు రోజుకు డిమాండు పెరుగుతోంది. దరఖాస్తులు చేసుకోవడం, అవసరమైన ధ్రువపత్రాల విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాల్సి ఉంటుంది.

# రంగు మారిన తాజ్

**ఏఎస్ఐపై సుప్రీం ఆగ్రహం**





**న్యూఢిల్లీ :** చారిత్రక తాజ్‌మహల్ కట్టడాన్ని సంరక్షించే విధంగా తగిన చర్యలు తీసుకోవడంలో భారత పూరావస్తు శాఖ (ఏఎస్ఐ) పూర్తిగా విఫలమైందంటూ సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. కీటకాల వల్ల ఈ పాలరాతి కట్టడం పాడైపోతోందని ఆందోళన వ్యక్తంచేసింది. దీన్ని నిరోధించేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారని ఏఎస్ఐతోసహా సంబంధిత అధికారులను ప్రశ్నించింది. ఏఎస్ఐ తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించివుంటే ఇలాంటి పరిస్థితి దాపురించేది కాదని సర్వోన్నత న్యాయస్థానం వెల్లడించింది. ఇంత జరిగినా ఏఎస్ఐ తనను తాను సమర్థించుకునేందుకు ప్రయత్నిస్తుండడం ఆశ్చర్యంగా ఉందని వ్యాఖ్యానించింది. తాజ్‌మహల్ వంటి చారిత్రక కట్టడాన్ని సంరక్షించేందుకు ఏఎస్ఐ అవసరమా.. అన్నది కేంద్రం స్పష్టంచేసూలని జస్టిస్ ఎంబీ లోకుర్, జస్టిస్ దీపక్ గుప్తాలతో కూడిన ధర్మాసనం కేంద్రం తరపు హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఏఎన్ఎస్ నాద్కర్ణికి సూంచారు. తాజ్ సంరక్షణ కోసం అంతర్జాతీయ నిపుణులను నియమించాలన్న అత్యున్నత న్యాయస్థానం సూచనను పర్యావరణం, అటవీశాఖ (ఎంవోఈఎఫ్) పరిశీలిస్తోందని నాద్కర్ణి కోర్టుకు లెలిపారు. యమునా నదిలోనీరు నిల్వ ఉండడంతో క్రిమికీటకాల సమస్య ఉత్పన్నమైందని ఏఎస్ఐ తరపు న్యాయవిది ధర్మాసనానికి వివరించారు. 1631లో మొఘల్ చక్రవర్తి షాజహాన్ తన భార్య ముంతాజ్ మహల్ స్మారకంగా నిర్మిం చిన ఈ చారిత్రక కట్టడం పరిరక్షణ చర్యలను సుప్రీంకోర్టు పర్యవేక్షిస్తోంది. తాజ్‌మహల్‌ను యునెస్కో వరల్డ్ హెరి టేజ్ సైట్‌గా గుర్తిం చడం తెలిసిందే. తాజ్‌మహల్ రంగు మారుతుం డడంపై మే1న సైర్వోన్నత న్యాయస్థానం ఆందోళన వ్యకం చేసింది. కాలుష్యం కారణంగా ఇలా జరుగుతున్నప్పటికీ కేంద్రం పట్టించుకోవడంలేదని వ్యాఖ్యానించింది. ఇంతముందుకు పసుపు వర్ణంలోకి మారిన తాజ్ ఇప్పుడు ఎర్రబడుతుండడంతో సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. 17వ శతాబ్దపు పాలరాతి కట్టడానికి జరిగిన నష్టాన్ని అంచనా వేసి దానిని పునరుద్ధరించేందుకుగాను దేశీయ, విదేశీయ నిపుణుల సహాయాన్ని తీసుకోవాలని కేంద్రాన్ని ఆదేశించింది. విదేశీ పర్యాటకులు, ముఖ్యంగా ఇతర దేశాధినేతలు సైతం తాజ్‌ను సందర్శించేందుకు మొగ్గు చూపుతారని, ఇటీవల కెనడాప్రధాని కూడా ఈ పాలరాతి అందాన్ని తిలకించేందుకు ఆగ్రావెళ్లిన విషయాన్ని గుర్తుచేసింది. ఈ కట్టడాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొంది. తాజ్‌మహల్ పరిరక్షణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో వివరిస్తూ విజన్ డాక్యామెంట్ ముసాయి దాను సమర్పించాలని మార్చిలో యూపీ ప్రభూత్వాన్ని సుప్రీం ఆదేశించడం తెలిసిందే.

## మహానాడు ఏర్పాట్ల ప్రారంభం

**రాజధాని ప్రతినిధి,అమరావతి :** తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు ఎన్టీ రామారావు జయంతిని పురస్కరించుకొని ఆ పార్టీ ప్రతి ఏటా నిర్వహించే మహానాడు కార్యక్రమాన్ని ఈ నెల 27, 28, 29 తేదీల్లో మూడు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకోసం ఉదయం పార్టీ అధ్యక్షులు కళా వెంకట్రావు భూమి పూజ నిర్వహించి ఏర్పాట్లను ప్రారంభించారు. సార్వత్రిక ఎన్నికలకు విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. విజయవాడ పరిసరాల్లో ఎన్టీఆర్ హయాంలో మూడు మహానాడులు జరగ్గా, చంద్రబాబు హయాంలో జరుగుతున్న తొలి మహానాడు ఇదే కావడం విశేషం.కానూరు సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో పార్టీ ముఖ్య నేతలు పూజా కార్యక్రమాలు నిర్వహించి మహానాడు ఏర్పాట్లకు శ్రీకారం చుట్టారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కళా వెంకట్రావు మహానాడు ఏర్పాట్లకు ఉదయం భూమిపూజ నిర్వహంచారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దేవినేని ఉమామహేశ్వరరావు, కొల్లు రవీంద్రతో పాటు ప్రభుత్వ విప్ బుద్దా వెంకన్న,ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్ రావు, బోడె ప్రసాద్, ఎమ్మెల్సీలు టీడీ జనార్ధన్, రాజేంద్రప్రసాద్, తెలుగు యువత, టీఎన్ఎస్ఎఫ్ విభాగాల నేతలు పాల్గొన్నారు. మొత్తం 2లక్షల చదుగుల ప్రాంగణంలో మహానాడు నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో ప్రధాన స్టేజీ 60అడుగుల పొడువు 120అడుగుల వెడల్పుతో మొత్తం 250మంది అశీనులయ్యేలా ఏర్పాటు చేస్తున్నారు.

# సవాళ్ల స్వాగతం

**మొదటి పేజీ తరువాయి**

అక్కడకు, ఎప్పుడు రమ్మంటే అప్పుడు వెళ్లాల్సి ఉంటోంది. ర్యాలీలు, ప్రదర్శనలకు ప్రభుత్వం నిర్వహించే అడ్డమైన కార్యక్రమాలకు జనాలను సమీకరించాల్సి వస్తోంది. ఉద్యోగుల్లో భాద్యతారాహిత్యం పేరుకుపోయింది. ఇదే సమయంలో నానాయాగీ చేస్తేనే పనులవుతాయని ప్రజల్లో నమ్మకం ఏర్పడింది. వెరసి సమాజం ఒక అస్తవ్యస్త పరిస్థితిలో చిక్కుకు పోయింది. నూతనంగా ఎంపికైన కలెక్టర్లు ప్రస్తుత సామాజిక పరిస్థితులను పరిగణలోకి తీసుకొని ఒక మంచి వాతావరణాన్ని నెలకొల్పే దిశలో పనిచేయాలని, సామాజిక శాస్త్రవేత్తలు కోరుతున్నారు. సీనియర్ కలెక్టర్లు సైతం అధికారపార్టీ కార్యకర్తలా మారి ముఖ్యమంత్రి కార్యక్రమాలకు ప్రజలను తరలించే బాధ్యతలు స్వీకరించడం మానుకోవాలి. ఉద్యోగాలకు ఉండే హుందాతనం, గౌరవాన్ని నిలబెట్టుకోవాలి. **ఇదివరలో ఒక మంత్రి కలెక్టర్‌ను కలవాలంటే ఆయన ఖాళీసమయాన్ని చూసుకొని అపాయింట్ మెంట్ తీసుకొని వెళ్లేవారు.అయితే పరిస్థితి పూర్తిగా మారిపోయింది.** సొంత పనులకోసం,పెత్తనం చెలాయించడం కోసం మంత్రులు వేళాపాళా లేకుండా అధికారులను వారి విధులకు ఆటంకం కలుగ చేస్తున్నారు. ఉద్యోగబాధ్యతలు ఏవి, పార్టీ కార్యక్రమాలు ఏవో ముందు అవగాహన ఏర్పరుచుకొని ఉద్యోగులు తమ హుందాతనాన్ని కాపాడుకోవాల్సిన అగత్యం ఏర్పపడింది.

నీతి,నిజాయితీలతో నిర్వహించే ఉద్యోగబాధ్యతలనే ప్రజలు పరిపాలనాదక్షతగా గుర్తిస్తారని తెలుసుకోవాలి. రాజకీయాలు తమ పరిధిని దాటి అన్ని వ్యవస్థలను చుట్టబెట్టి ప్రజలను వెతలకు గురిచేస్తోంది.ఈ సమస్యను పరిష్కరించాలంటే నూతనంగా అధికార పదవీబాధ్యతలు తీసుకునేవారు అధికార నేతల అడుగులకు మడుగులొత్తకుండా విధుల్లో అలసత్వం ప్రదర్శించకుండా ప్రజా అండదండలతో ఈ సమాజాన్ని ప్రగతి బాట పట్టడానికి కృషి చేయాలి. రాజకీయ నాయకులు వారి సొంత ఎజెండాలు అమలు చేయకపోతే కక్ష్య సాధింపుచర్యలకు తెగబడతారు. ఒకటి వారి నుంచి అధికారులు తమను తాము కాపాడుకుంటూనే, సమాజాన్ని ముందుకు తీసుకెళ్లగలగాలి. ప్రజలను అప్రమత్తం చేసి రాజకీయనాయకుల ఎత్తుగడలను తిప్పికొట్టగల బాధ్యత యువ కలెక్టర్లపై ఉంది. చదువుసంధ్యలు లేని గుండాలంతా రాజకీయ నాయకులుగా అవతారం ఎత్తి, అటు ప్రజలను,ఇటు అధికారులను వేధింపులకు గురిచేస్తుంటే తమ మేథోసంపత్తితో ఎదుర్కోవలసిన అగత్యం వారికుంది. అంతేకాని అధికార పార్టీలో కీలు బొమ్మలుగా మారి ఎన్నికల ప్రచారాలకు వెళ్లి ప్రజలు,ప్రతిపక్షాలతో చివాట్లు తినే పరిస్థితి తెచ్చుకోకూడదు. మునుపటి తరం అధికారులు (అవినీతికి, అక్రమానికి పాల్పడిన వారిని తప్ప) క్రమశిక్షణకు, సిబ్బంది యోగక్షేమాలకే అధిక ప్రాధాన్యత ఇచ్చేవారు. అయితే ప్రస్తుతం దీనికి భిన్నమైన పరిస్థితి వచ్చింది. రాజకీయనాయకుల చేతిలో కీలుబొమ్మలుగా మారడం, ఎమ్మెల్సీ పదవులను ఆశించడం వంటి చౌకబారు పనులకు పాల్పడడాన్ని ప్రజలు జీర్ణించు కోలేకపోతున్నారు. ఒక ఎమ్మెల్యే కేవలం అయిదేళ్లపాటు పాలన చేయగలడు. రెండో సారి ఎన్నికైతే మరో ఐదేళ్లు.. అంతకు మించి ప్రజా సేవలో ఉండే వారు బహుతక్కువ. కానీ అధికారులు దాదాపు 30 ఏళ్లపాటు ప్రజాజీవితంలో ఉంటారు. వారికి సేవ చేసే అంతటి మహత్ భాగ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

# రాజకీయాల్లో ఉద్యోగులు

ఉద్యోగులు రాజకీయాలు చేస్తున్నారంటే అది ఆయా సంఘాల ఎన్నికలకు అనుకునేవాళ్లు ఇదివరలో .. ఇప్పుడు ఉద్యోగాలుచేయడంతో సంతృప్తి చెందకుండా ఎప్పుడు రాజకీయాల్లోకి రావాలా అని తహతహలాడుతున్నారు. ఇందుకు ఉదాహరణగా ఎన్‌జీవో నాయకుడు పరుచూరి అశోక్ బాబు వ్యవహారం చెప్పవచ్చు. కర్ణాటకలో ఎన్నికల ప్రచారం కోసం మే 6న గన్నవరం విమానాశ్రయంలో ఉద్యోగ సంఘాల నాయకులతోపాటు, అశోక్‌బాబు, చంద్రశేఖర్ రెడ్డి, విద్యాసాగర్, వీరేంద్రబాబు, ఏపీజేఎఫ్ అధ్యక్షుడు చెవుల కృష్ణాంజనేయులు, శివరాజేష్, కాశిరెడ్డి, సాయినరేష్, సినీ విమర్శకులు కత్తి మహేష్ అక్కడకు వెళ్లారు. మిగతావారి సంగతేమో గాని ఇంతవరకు ఉద్యోగ సంఘాల నాయకులు చేయలేని సాహసం మాత్రం చేశారు.

అక్కడి తెలుగువారిని కలసి బీజేపీకి ఓటువేయొద్దని చెప్పడం తెలుగు ప్రజలకు, బీజేపీ వర్గాలకు కూడా ఆగ్రహం తెప్పించింది. ప్రత్యేక హోదా కోసం పోరాడకుండా ఇక్కడికి ఎందుకు వచ్చారని తెలుగు ప్రజలు ప్రశ్నించగా, ఉద్యోగులు ఎన్నికల ప్రచారంలో పాల్గొనడమేమిటని అతన్ని వెంటనే విధుల నుంచి తొలగించాలని బీజేపీ వర్గాలు పట్టుబడుతున్నాయి. విజయవాడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాసేపు ప్రచారానికి వెళ్లలేదని, మరొకొంతసేపు అశోక్ మాట్లాడుతూ కేవలం 150 మందితో మాట్లాడితేనే ఓడిపోతామని బీజేపీ భయపడుతోందని అనడంతో ఫక్తు రాజకీయనాయకుడిగా మారిపోయాడ అని జనాలు విస్తుపోయారు. ఆయన రాజీనామా చేసి రాజకీయాల్లో చేరితే ఫర్వాలేదు కాని, ఉద్యోగిగా రాజకీయ ప్రచారానికి వెళ్లడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరొ విషయం ఏమంటే... ఏపీజేఎఫ్ అధ్యక్షుడు కృష్ణాంజనేయులు, అశోక్‌బాబు ఎన్నికల ప్రచారం నిమిత్తం వెళ్లలేదని చెబుతున్నారు. కాని సోషల్ మీడియాలో పెట్టిన పోస్టింగ్ భిన్నంగా ఉంది. దీనికి సమాధానం వారే చెప్పవలసి ఉంది.




# రాష్ట్రాభివృద్ధికి పరిశ్రమలే అత్యంత కీలకం

**రాజధాని ప్రతినిధి, సచివాలయం :** రాష్ట్రాభివృద్ధిలో పరిశ్రమలే కీలకంగా ఉంటాయని పరిశ్రమల శాఖ మంత్రి ఎన్.అమరనాథరెడ్డి అన్నారు. సచివాలయం 2వ బ్లాక్‌లోని సమావేశ మందిరంలో ఏపీఐఐసీ జిల్లా పరిశ్రమల కేంద్రాల జనరల్‌మేనేజర్లు, జోనల్‌మేనేజర్ల సమావేశంలోఎంఎస్ఎంఇ పార్కులు, ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాట్లను మంత్రిసమీక్షించారు. ఉన్న చిన్న చిన్న పారిశ్రామికవేత్తలకు మద్దతుగా నిలిచేందుకు నియోజకవర్గస్థాయిలోనే ఎంఎస్ఎంఈ పార్కులను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి సంకల్పించామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల ప్రకారం ప్రతి నియోజకవర్గంలో చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఇ-మైక్రో,స్మాల్ అండ్ మీడియం ఎంటర్ ప్రైజెస్) పార్క్ ఏర్పాటు చేయడానికి కావలసిన భూములను త్వరగా గుర్తించి, సేకరించాలని అధికారులను ఆదేశించారు. మొదటిదశలో ప్రతి రెవెన్యూడివిజన్‌లో ఒకపార్కు ఏర్పాటు చేస్తామన్నారు. జూన్ లేక జూలైలో ఎంఎస్ఎంఈ సదస్సు నిర్వహించాలన్న పట్టుదలతో ముఖ్యమంత్రి ఉన్నారని వివరించారు. ఎక్కువ ఎంవోయులు అయ్యేలా కృషి చేయాలన్నారు. ఈనెల 31లోపు ప్రతి రెవెన్యూ డివిజన్‌లో పార్కుకు సరిపడ భూమి గుర్తించి స్వాధీనం చేసుకోవాలన్నారు. మొదట అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూములకు ప్రాధాన్యత ఇచ్చి స్వాధీనం చేసుకోవాలు చెప్పారు. పార్కుకు ఎంపిక చేసిన స్థలంలో లేఅవుట్లు, రోడ్లు, కాలువలు, నీరు, విద్యుత్



సౌకర్యం వంటి మౌలిక వసతులను సమకూర్చడాకి కూడా వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే పార్కులలో పెట్టుబడులు పెట్టడానికి, చిన్న పరిశ్రమలను స్థాపించడాకి ముందుకు వచ్చిన వారి వద్ద నుంచి డీపీఆర్ (డిటెయిల్ ప్రాజెక్ట్ రిపోర్ట్)లు తీసుకొని పంపించాలన్నారు. ఆయాప్రాంతాల్లో స్థాపించే పరిశ్రమలకు అవసరమైనమేరకు మౌలిక వసతులు కల్పించాలన్నారు. పనులు వేగంగా జరగడం కోసం రాష్ట్రస్థాయి అధికారాలను కూడా జిల్లా అధికారులకు అప్పగించామన్నారు. ఆన్‌లైన్‌లో పారిశ్రామిక ప్రోత్సాహకాలు, సబ్సిడీలు ఆలస్యం లేకుండా వెంటనే చెల్లించాలని ఆదేశించారు. ప్రోత్సాహకాలు ప్రకటించడంలో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. రానున్న పది రోజుల్లో రూ.2వేల కోట్ల బ్యాంకు రుణం రానున్నట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ప్రోత్సాహకాలన్నింటినీ క్లియర్ చేయాలనే ఉద్యేశంతో ఆ రుణం మొత్తం ప్రోత్సాహకాలకే ఉపయోగిస్తున్నామని మంత్రి తెలిపారు. ఎప్పుడైతే పరిశ్రమలకు సరైన సమయంలో సక్రమంగా ప్రోత్సాహకాలు అందజేస్తే అప్పుడు ప్రభుత్వంపై వారికి నమ్మకం ఏర్పాడుతుందని, తద్వారా మరింత మంది పారిశ్రామికవేత్తలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకువస్తారని వెల్లడించారు. ఇక ఇప్పటివరకు చేసుకున్న ఎంవోయులపై ప్రత్యేకమైన దృష్టిపెట్టి వాటిని అమలు అయ్యేలా చూడాలని అధికారులను కోరారు. జిల్లా పరిశ్రమల కేంద్రాల కార్యాలయాలు లేనిచోట కొత్తభవనాలు నిర్మించేందుకు ప్రభుత్వం సుముఖంగా ఉందని వెల్లడించారు. పరిశ్రమల అధికారులపైనే ఈ రాష్ట్రభవిష్యత్తు ఆధారపడి ఉంటుందన్నారు. అధికారులు పారిశ్రామికవేత్తలకు సహకరించి పెట్టుబడులు పెట్టేలా ప్రోత్సహించాలని సూచించారు. సింగిల్ డెస్క్ పోర్టల్ పనితీరు బాగుందని ప్రశంసించారు.

**ఏపీఐఐసీ స్వాధీనంలో 42 ఎంఎస్ఎంఈ పార్కుల భూములు**

రాష్ట్రం వ్యాప్తంగా 42 ఎంఎస్ఎం ఈపార్కులకు సంబంధించిన భూములు ఏపీఐఐసీ స్వాధీనంలో ఉన్నట్లు అధికారులు చెప్పారు. మరికొన్ని నియోజకవర్గాల్లో భూములను గుర్తించినట్లు తెలిపారు. కొన్ని నియోజకవర్గాలో ప్రభుత్వ భూములు లేనిచోట ప్రైవేటు పట్టాభూములు కొనుగోలు చేయాలని చెప్పారు.

# ఏపీఎస్సీ టాపర్ అను కుమారి



అనేక బాధ్యతలు స్వీకరిస్తూనే అనుకున్న లక్ష్యాలను చేరుకోగలరని నిరూపించిన మహిళ అనుకుమారి. వివాహం విద్యనాశాయ అని అంటుంటారు కాని, అది ఏమాత్రం సరికాదని, ఎలాంటి పరిస్థితులనైనా అవలీలగా జయించే మనోధైర్యం మగువలకు ఉందని చాటి చెప్పిన మహిళ యూపీఎస్సీలో రెండో ర్యాంకు సాధించిన అనుకుమారి.

సాధారణ కుటుంబంలో పుట్టిన అనుకుమారి (31) మహిళల్లో మొదటిస్థానం, ఐఏఎస్ టాపర్స్‌లో రెండో స్థానంలో నిలిచారు. లింగనిష్పత్తిలో 1000 మంది బాలురకు 854 మంది బాలికలు గల హర్యానాలోని సోనిపేటలో ఆమె పుట్టారు. నాలుగేళ్ల బాబుకు తల్లిగానే కాకుండా ఇంటి బాధ్యతలు నిర్వహిస్తూనే ఆమె రోజుకు 12 గంటలు చదివేవారని వెల్లడించారు. ఢిల్లీ వర్సిటీ నుంచి ఫిజిక్స్‌లో బీఎస్సీ హానర్స్, ఐఎంటీ నాగపూర్ నుంచి ఎంబీఏ ఫైనాన్స్ అండ్ మార్కెటింగ్‌లతో ఎంబీఏ చదివారు. సివిల్స్‌కు రాకముందు 9ఏళ్లపాటు ఆమె ఏడాదికి రూ. 20 లక్షల వేతనానికి అవివా ఇన్స్యూరెన్స్‌లో పనిచేశారు. 2016లో ఆమె మనస్సు ఐఏఎస్ వైపు మళ్లటంతో ఆ ఏడాది ఢిల్లీలోని నైస్ ఇన్‌స్టిట్యూట్‌లో ఆమె సివిల్స్ కోచింగ్ తీసుకొన్నారు. అయితే ఒక్క మార్కు తేడాతో ఆమె ప్రిలిమ్స్ చేజార్చుకున్నారు. దీంతో మరింత పట్టుదలతో చదివి రెండో సారి రెండో ర్యాంకు తెచ్చుకోవడం గర్వకారణం. భర్త వరుణ్ దహియా వ్యాపారవేత్త, కుమారుడు రిహాన్ దహియా (4)బాధ్యతలు చూసుకుంటూనే రోజుకు 12 గంటలపాటు చదివానని ఆమె చెప్పారు.సివిల్స్‌లో రెండో ర్యాంకు తెచ్చుకోగానే, పట్టణ, స్థానిక సంస్థల మంత్రి కవితా జైన్ ఆమెను బేటీ బచావో, బేటీ పడావో

ఆమె

కార్యక్రమానికి బ్రాండ్ అంబాసిడర్‌గా నియామకం జరిపారు. అను విజయంతో సోనిపేట తల్లిదండ్రులంతా బాలికల పట్ల సానుకూల ధృక్పదం కలిగి ఉంటారన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ ఏడాది 1,058 ఖాళీలు ఉండగా, వాటిలో 750 మంది పురుషులు, 240 మంది మహిళలను ఐఏఎస్,ఐపీఎస్,ఐఎఫ్ఎస్ వంటి వాటిలోకి ప్రభుత్వం ఎంపిక చేసింది. అక్టోబరు -నవంబరులో జరిగిన యూపీఎస్సీ పరీక్షకు 9,57,590 మంది దరఖాస్తు చేయగా, 4,56,625 మంది పరీక్షకు హాజరవ్వగా, 13,366 మంది అర్హత సాధించారు. దేశం మొత్తం మీద ప్రతి 1000 మంది పురుషులకు 980 మంది మహిళలు ఉండటంతో ప్రధాని మోడీ బేటీ బాచావో కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. 2018 నాటి యూపీఎస్సీ పరీక్షను జూన్ 3న నిర్వహిస్తున్నారు.

## కాలమ్

### దేశంలో అతిపెద్ద జోక్

7సంవత్సరాల క్రితం ఒకాయన 10లక్షల కోట్ల కుంభకోణం జరిగిందని చెప్పాడు. ఇంకొకాయన ఈ విషయాన్ని ప్రజలకు వివరించటానికి ఒక ఉద్యమాన్ని నిర్మించాడు.

మూడవ వ్యక్తిగా ఒక మహిళ, నాలుగవ వ్యక్తీ జత కలిశారు.

2జి కుంభకోణాన్ని ప్రజలకు వివరించటానికి 5వ వ్యక్తి మరో ఉద్యమాన్ని నిర్మించాడు. 6వ వ్యక్తి ఈ విషయాన్ని సుప్రీం కోర్టుకు తీసికెళ్ళాడు.

వీళ్ళందరి కఠోర శ్రమను 7వ వ్యక్తి సంకలనంచేసి ఈ కుంభకోణానికి వ్యతిరేకంగా ఓటువేయాలని ప్రజలను కోరాడు.

**ఏడు సంవత్సరాల తర్వాత...**

అది కుంభకోణం కానేకాదనీ, నిందితులందరూ నిర్దోషులనీ కోర్టు తీర్పు చెప్పింది...

ప్రస్తుతం 1వ వ్యక్తి వినోద్ రాయ్ బిసిసిఐకి అధినేత అయ్యాడు. ఈయనకు పద్మవిభూషణ్ బిరుదు ఇచ్చారు.

2వ వ్యక్తి అయిన అన్నా హజారే మౌనంగా ఉన్నాడు. ఈయనకు జడ్‌కేటగిరీ భద్రత కల్పించారు.

3వ వ్యక్తి అయిన మహిళ కిరణ్ బేడీ పుదుచ్చేరి గవర్నర్ గా నియమించబడింది.

4వ వ్యక్తి అరవింద్ కేజ్రీవాల్ ఢిల్లీ ముఖ్యమంత్రి అయ్యాడు.

5వ వ్యక్తి రామ్‌దేవ్ వ్యపారవేత్తగామారి కోట్లు గడిస్తున్నాడు.

6వ వ్యక్తి సుబ్రమణ్యం స్వామి పార్లమెంటు సభ్యుడయ్యాడు.

ఇక 7వ వ్యక్తి దేశానికి ప్రధాని అయ్యాడు...

**అంతిమంగా మనమందరం వెర్రివెంగళప్పలమయ్యాము.**

# అసంబద్ధ ఒప్పందాలు.. రహదారులకు శాపాలు



**రాజధాని ప్రతిథిని, అమరావతి :** రాష్ట్రంలో జాతీయ రహదారులు(ఎన్‌హెచ్) విస్తరణలో తీవ్ర జాప్యం ఏర్పడింది. అసంబద్ధ ఒప్పందాలే ఇందుకు కారణంగా కనిపిస్తోంది. నెల్లూరు నుంచి తడ వరకు జిల్లాలో 110 కిలోమీటర్ల మేర ఆరు లైన్ల జాతీయ రహదారి వేసే విషయంలో నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎన్‌హెచ్ఏఐ) చేసిన పెద్ద తప్పే ప్రస్తుతం పెద్ద అడ్డంకిగా మారింది. 2001లో ఎన్‌హెచ్ఏఐ, టోల్ సంస్థ మధ్య జరిగిన ఒక ఒప్పందం ప్రాజెక్టుకు అడ్డంకిగా మారింది. 2031కి ముందుగా ఈ ఆరు లైన్ల రహదారి పూర్తయ్యే అవకాశం లేదు. ఒక ప్రత్యేక ప్రయోజన వాహిక ద్వారా జిల్లాలో ఈ ఎన్‌హెచ్ ప్రాజెక్టు అమలవుతోంది. ఐజేఎం కార్పొరేషన్, సీఐడీబీఐ, డబ్ల్యూసీటీ బెర్హాడ్, భూమి హైవేస్ వంటి నాలుగు మలేషయా కంపెనీలు ప్రాజెక్టులో భాగస్వామ్యంగా ఉన్నాయి. 30 ఏళ్ల ఒప్పందం ప్రకారం, ఆరు లైన్ల జాతీయ రహదారిగా మార్పు చేస్తూ ప్రభుత్వం టెండర్లు పిలవాలనుకుంటే, స్వర్ణ టోల్ వేస్‌తో పరిష్కరించుకునేందుకు నిర్వహణ చార్జీలను మినహాయించిన తర్వాత వచ్చే 15 ఏళ్లకు టోల్ చార్జీలను వారు ముందస్తు చెల్లింపు చేయాలి. వాస్తవంగా మలేషియా కంపెనీ సీఐడీబీఐతో 2000, డిసెంబరు 19న ఎన్‌హెచ్ఏఐ ఒప్పందం కుదుర్చుకుంది. సీఐడీబీఐ ద్వారా ఏర్పాటయిన ప్రత్యేక ప్రయోజన వాహకం(ఎస్‌పీవీ)కి అన్ని హక్కులు, ప్రయోజనాలు, విధులు, బాధ్యతల బదిలీకి సీఐడీబీఐ అధకార ఒప్పందంలోని 5 నిబంధనగా ఉంది. ప్రాజెక్టును సొంతంగా లేదా భాగస్వామ్యులతో పూర్తి చేసినా సర్వహక్కులను ఆ కంపెనీకి ధారాదత్తం చేశారు. ఎస్‌పీవీతో ఒక రాయితీ ఒప్పందంలోకి సీఐడీబీఐ, ఎన్‌హెచ్ఏఐ ప్రవేశం ఉంటుంది. 30 ఏళ్ల కాలానికి ఎన్‌హెచ్ఏఐ రాయితీ కింద సీఐడీబీఐ, ఎన్‌హెచ్ఏఐ మధ్య 2001, మార్చి 27న రాయితీ ఒప్పందం కుదిరింది. ప్రత్యేక హక్కులు, లైసెన్సు, ప్రాజెక్టు అమలు అధికారం ఇందులో ఉన్నాయి. అదేవిధంగా నెల్లూరు జిల్లాతో తడ-నెల్లూరు మధ్య 110 కిలోమీటర్ల నుంచి 163.60 కి.మీ మధ్య రెండు లైన్ల నుంచి నాలుగు లైన్లకు రహదారి విస్తరణను పూర్తి చేసింది. జాతీయ రహదారి విస్తరణ విషయంలో కూడా ఒప్పందంలో నిబంధనలకు కుట్టుబడి ఉండేందుకు ప్రాజెక్టు నిర్మాణం-నిర్వహణ-బదిలీ(బీవోటీ)కి ప్రత్యామ్నాయం లేదు. కాగా బుజబుజ నెల్లూరు, తడ మధ్య కేవలం నాలుగు లైన్ల రహదారి మాత్రమే ఉంది. కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకునే వరకు దీనిని విస్తరించే అవకాశం లేదు. ఇదిలాఉండగా సూళ్లూరు పేట, వెంకటాచలం, బూదానంలలో మూడు చోట్ల స్వర్ణ టోల్ వేలుయ ఉన్నాయి. ఎన్‌హెచ్ఏఐ ఇక్కడ ఆరు లైన్ల రహదారిని పూర్తి చేసేందుకు స్వర్ణ టోల్ వేను ఆహ్వానించింది. అయితే ప్రాజెక్టుపై ఆ కంపెనీ ఆసక్తి చూపలేదు. గోల్డెన్ క్వాడ్రిలేటరల్ ప్రాజెక్టు కింద నెల్లూరు-తడ నాలుగు లైన్ల జాతీయ రహదారి దేశంలోనే తొలి ప్రాజెక్టు. ఆ సమయంలో భవిష్యత్‌లో ఆరులైన్ల రహదారిగా విస్తరించే ఆలోచన చేయడంలో ప్రభుత్వ యంత్రాంగం విఫలమయ్యింది. సమస్యను సంక్లిష్టం చేసుకునేలా ఒప్పందం కుదుర్చుకుంది. అయితే, రహదారి విస్తరణ అవసరాన్ని బట్టి కేంద్ర రహదారులు, రవాణా మంత్రిత్వ శాఖ ఒక నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. కానీ ప్రస్తుతం, ప్రత్యేక తరగతి హోదాపై కేంద్రం, రాష్ట్రం మధ్య ఘర్షణ కారణంగా అది వెంటనే సాధ్యపడే విషయం కాదు. ప్రాజెక్టు ముందుగా పూర్తయ్యేందుకు స్థానిక రాజకీయ నాయకులే కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని ఎన్‌హెచ్ఏఐ అధికారి ఒకరు పేర్కొన్నారు.



# రాజధాని క్లాసిఫైడ్స్

## నివాస ప్లాట్లు

**నవులూరు**
రాజధాని ప్రాంతంలోని నవులూరు గ్రామ పరిధిలో **500, 1000** గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ :**9440662699**

**రాయపూడి**
రాజధాని ప్రాంతంలోని రాయపూడి గ్రామ పరిధిలో **500, 1000** గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ : **9908244333**

నీరుకొండ
రాజధాని ప్రాంతంలోని నీరుకొండ గ్రామ పరిధిలో **500, 1000, 2000** గజముల ప్లాట్లు కావలెను
ఫోన్: **9440662699**

## ఇతరములు

**తుళ్ళూరు**
ఎస్.ఎమ్(స్టైల్ ఫర్ మెన్) ట్రైలర్స్
ఫోన్ **9440307123**

**పి.యల్.సి.బి డెవలపర్స్**
అమరావతి రాజధాని ప్రాంతంలో ఇళ్ల స్థలములు కావలసిన వారు సంప్రదించండి
ఫోన్ : **9440662699**

**మందడం**
ఎస్.ఆర్.కె. గ్రాండ్ రెస్టారెంట్
ఫోన్ : **9553023388**

**వెలగపూడి**
సాయి గణేష్ ట్రెడర్స్: నిర్మాణ రంగానికిసిమెంట్, స్టీలు, పైపులు, పెయింట్‌లు అమ్మబడును.
ఫోన్ : **9640811333**

**రాయపూడి**
చంద్రిక ట్రెడర్స్ నిర్మాణ రంగానికి సిమెంట్, స్టీలు,పైపులు అమ్మబడును.
ఫోన్ : **9908073516**

**రాయపూడి**
రియల్‌ఎస్టేట్ క్రయ,విక్రయాలకు సంప్రదించడం న్యూసింగపూర్ రియల్ ఎస్టేట్
ఫోన్ : **9848442436**

**రాయపూడి**
కాకతీయ ఫుడ్ కోర్ట్
ఫోన్ **9848021898**

## షాప్స్

**తుళ్ళూరు**
రేమాండ్స్‌ట్రైలర్స్
ఫోన్ : **9492470426**

**రాయపూడి**
వర్షిత ఫోటోస్టాట్
ఫోన్ : **9985853188**

**తుళ్ళూరు**
వైభవ్ డ్రస్సెస్
ఫోన్ : **9848407935**

**తుళ్ళూరు**
రాజా గోల్డ్ కవరింగ్
ఫోన్ : **9581500500**

**తుళ్ళూరు**
శ్రీసాయి జ్యూయలరీ వర్క్స్
ఫోన్ :**9247171083**

**రాయపూడి**
ఖాజా ఖాదర్ రైస్ స్టోర్స్
ఫోన్ : **9603990791**

## హస్పటల్స్

**విజయవాడ**
ఆంధ్ర హస్పటల్, డా॥శ్రీమన్నారాయణ
ఫోన్ : **9177219900**

**విజయవాడ**
ఇంధిరారావు మెడికేర్ (సెంటర్)
ఫోన్ : **9440421580**

**విజయవాడ**
న్యూఫేస్ కీనిక్ , డా॥మేహబూబ్
ఫోన్ : **9849122788**

**విజయవాడ**
అష్రఫ్ మెటర్నిటీ & ఇ,ఎన్‌టి
డా॥ రెహమాన్
ఫోన్: **0866-2475087**

**విజయవాడ**
శ్రీమానస సైకియాట్రిక్
డా॥ అయోధ్య ఆర్.కె
ఫోన్:**0866-2436647**

విశాఖపట్నం
చింతలూరు ఆయుర్వేద
డా॥ విశ్వనాథ్
ఫోన్ :**90329 90138**

## వాణిజ్య ప్లాట్లు

**నవులూరు**
రాజధాని ప్రాంతంలోని నవులూరు గ్రామ పరిధిలో **500, 1000, 2000** గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ : **9440662699**

**ఐనవోలు**
రాజధాని ప్రాంతంలోని ఐనవోలు గ్రామ పరిధిలో **500, 1000, 2000** గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ : **9908244333**

నీరుకొండ
రాజధాని ప్రాంతంలోని నీరుకొండ గ్రామ పరిధిలో **500, 1000, 2000** గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ : **9440662699**

గమనిక : క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటన దారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/లేదా అతనిపై చట్టరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

\- మేనేజర్

ప్రకటనలకు సంప్రదించండి 9493170689


# ఐదు రోజులు విధ్వంసమే




**న్యూఢిల్లీ :** దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల ప్రజలు భారీ వర్షాలు, పిడుగులు, ఇసుక తుపానులతో వణికిపోతున్నారు. మరోవైపు వాతావరణ విభాగం తాజాగా హెచ్చరికలు జారీ చేసింది. రానున్న ఐదు రోజుల్లో భారీ వర్షాలు, పిడుగులు, ఉరుములతో కూడిన గాలివానలు, దుమ్ము ముంచెత్తనుందని ఐఎండీ తెలిపింది. ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ సహా ఉత్తర భారతదేశంలోని అనేక ప్రాంతాల్లో వడగాలులు, దుమ్ముతుపాను సంభవించవచ్చని అంచనా వేసింది. బీహార్, జార్ఖండ్, ఒడిశా, అసోం, మేఘాలయ, నాగాలాండ్ మణిపూర్, మిజోరం, త్రిపుర, కోస్తా కర్ణాటక, తమిళనాడు, పుదుచ్చేరి, కేరళలలో ఉరుములతో కూడిన తుపానులు, భారీ వేగంతో గాలులు వీస్తాయని తెలిపింది. భారత వాతావరణ విభాగం(ఐఎండీ) తాజా హెచ్చరికల ప్రకారం మే 10 (నేడు)న ఉరుములతో కూడిన తుపాను వచ్చే అవకాశాలు ఉన్నాయి. 50-70 కి.మీ వేగంతో గాలులు వీస్తాయి. పశ్చిమ బెంగాల్, సిక్కింలను తీవ్రమైన వడగాలులు వణికించనున్నాయి. బీహార్, జార్ఖండ్, ఒడిశా, అసోం,మేఘాలయ, నాగాలాండ్, మణిపూర్, మిజోరం, త్రిపుర, ఉత్తర కర్ణాటక, తమిళనాడు, పుదుచ్చేరి, కేరళల్లో భారీ వర్షాలు పడనున్నాయి. వీటితోపాటు విదర్భ, ఒడిశాలోనూ అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది. కర్ణాటక, తమిళనాడు, పుదుచ్చేరి, కేరళ దక్షిణ

**వాతావరణ శాఖ తాజా హెచ్చరిక**

ప్రదేశాలలో భారీ వర్షాలు కురుస్తాయి. మే 11,12 తేదీల్లో జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, తీరప్రాంత కోస్టల్ ఆంధ్రప్రదేశ్, దక్షిణ కర్ణాటక, కేరళ రాష్ట్రాలలో వేడి గాలులతో పాటు ఉరుములతో కూడిన గాలి తుపాను సంభవించవచ్చని వాతావరణ శాఖ అంచనా వేసింది. మే 13న జమ్మూకాశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లో వేడిగాలులు, మే 14 సోమవారం పంజాబ్, హర్యానా, చండీగఢ్, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, దక్షిణ కర్ణాటకలోని కొన్ని ప్రదేశాల్లో ఉరుములతో కూడిన గాలులు వీస్తాయని ఐఎండీ నివేదిక తెలిపింది. ఇటీవల కాలంలో, తుపానులు, భారీ వర్షాలు దేశంలోని వివిధ ప్రాంతాల్లో ప్రధానంగా ఉత్తర భారతదేశంలో పెను విధ్వంసం సృష్టించాయి. వంద మందికి పైగా చనిపోగా అనేకమంది గాయపడ్డారు. జైపూర్, అజ్మీర్, జోధ్‌పూర్, బికనీర్‌లలో దుమ్ము తుపానులు సంభవించింది. వాతావరణ విభాగం తాజా హెచ్చరికల నేపథ్యంలో అధికారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు.

# రైతు 'రుణం' తీరేనా?



- నాలుగైదు విడతల రుణమాఫీకి నిధుల కొరత
- బడ్జెట్‌లో అరకొర కేటాయింపులు
- రైతన్నల్లో ఆందోళన

**రాజధాని ప్రతినిధి, అమరావతి :** ఏపీలో రైతులకు రుణమాఫీ అందని ద్రాక్షగానే మిగిలిపోయేటట్లు ఉంది. మొదటి విడత చెల్లించడానికి రెండేళ్లు, రెండు మూడు విడతలకు మరో ఏడాదిన్నర పట్టింది. ఇంకా నాలుగు, ఐదు విడతల రుణమాఫీ చేయాల్సి ఉంది. ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ కాలపరిమితి మరో ఏడాది మాత్రమే ఉంది. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో మిగిలి ఉన్న రెండు విడతలను ఒకేసారి చెల్లించాలని సర్కార్ భావిస్తోంది. ఒకవైపు ముంచుకొస్తున్న గడువు, మరో వైపు వేధిస్తున్న నిధుల కొరత రుణమాఫీ అమలు జరుగుతుంది..? అనే సందిగ్ధం రైతుల్లో నెలకొంది.

**మూడు విడతల్లో ఇచ్చింది రూ.14వేల కోట్లే...**

కేంద్రం, రాష్ట్రంలో అధికారం అందిపుచ్చుకోవాలంటే అన్నదాతల అనుగ్రహం తప్పనిసరి, తమను ఆదుకునే పార్టీలకే రైతులు అధికారం కట్టబెడతారు. 2014 సాధారణ ఎన్నికల్లో రైతులందరికీ రుణమాఫీ చేస్తానంటూ టీడీపీ హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చింది. ఐదు విడతల్లో రుణమాఫీ చేస్తానని ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన సమయంలో చంద్రబాబునాయుడు ప్రకటించారు. ఆయన పీఠమెక్కి నాలుగేళ్లయినా రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ అమలు చేయడంలో విఫలమయ్యారు. ఇప్పటి వరకూ మూడు విడతల్లో మాత్రమే కొంతమంది రైతులకు రుణమాఫీ చేశారు. రాష్ట్రంలో 2014 నాటికి అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలంటే రూ.87 వేల కోట్లని ప్రభుత్వం లెక్కలు వేసింది. పలు ఆంక్షలు, కోతలు, నిబంధనల పేరుతో 10 శాతం వడ్డీతో కలిపి రూ. 24.500 కోట్లు సరిపోతుందని తుది అంచనాలు వేసింది. ఈ మొత్తాన్ని ఐదు విడతలు చెల్లిస్తామని చంద్రబాబు ప్రభుత్వం ప్రకటించింది. నేటి వరకూ మూడు విడతలకు గానూ రూ.14 వేల కోట్లు మాత్రమే చెల్లించింది. మిగిలిన నాలుగైదు విడతలకు రూ.10,500 కోట్లు చెల్లించాల్సి ఉంది. రెండు విడతలు ఒకేసారి చెల్లిస్తే రూ.1500 కోట్ల మేర వడ్డీ భారం తగ్గి, రూ.9 వేల కోట్ల రూపాయలు ఇస్తే సరిపోతుందని ప్రభుత్వ పెద్దలు లెక్కలు వేస్తున్నారు.

**'మాఫీ' కోసం పాట్లు**

ఇటీవల కేంద్ర ప్రభుత్వంతో చంద్రబాబు ప్రభుత్వం చేసుకున్న తెగతెంపుల ప్రభావం రాష్ట్ర ఖజానాపై పడింది. కేంద్ర ప్రభుత్వ పథకాలకు, రాష్ట్ర పునర్విభజన చట్టంలో పేర్కొన్న హామీలను అమలు చేయడంలో ప్రధానిమంత్రి నరేంద్రమోడీ విముఖత చూపుతున్నారు. అదే సమయంలో రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగానే ఉందని రాష్ట్ర ఆర్థికాశాఖాధికారులు చెబుతున్నారు. ఇటువంటి సమయంలో రైతు రుణమాఫీ చేయడం చంద్రబాబు ప్రభుత్వానికి పెనుభారంగా మారింది. నిధుల కొరత సమస్య అధిగమించడం ప్రభుత్వం పెద్దలకు సవాలుగా మారింది. పుండు మీద పుట్రలా సాధారణ ఎన్నికల గడువు తరుముకొస్తోంది. మరోసారి అధికారం అందిపుచ్చుకోవాలంటే పూర్తిస్థాయిలో రైతు రుణమాఫీ చేసి తన క్రెడిట్‌ను నిరూపించుకోవాల్సిన పరిస్థితి సీఎం చంద్రబాబుకు ఏర్పడింది.

**బడ్జెట్ కేటాయింపుల్లో మతలబు...**

2019 ఎన్నికల సీజన్ దృష్టిలో పెట్టుకుని చంద్రబాబు సరికొత్త ఎత్తుగడ వేస్తున్నారన్నారని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. రైతు రుణమాఫీ నాలుగైదు విడతలు ఈ ఏడాది ఒకేసారి చెల్లిస్తానని రైతులను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారంటున్నారు. ఏపీ ప్రభుత్వం ఇదివరకే మూడో విడత కోసం విజయాబ్యాంక్, ఆంధ్రాబ్యాంక్ నుంచి రైతు సాధికార సంస్థ పేరు మీద అప్పుతీసుకొని రుణమాఫీకి సర్దుబాటు చేసి రూ.500 కోట్లు బకాయి పడ్డారు. వీటిని 2018 బడ్జెట్ నుంచి సర్దుబాటు చేయాల్సి ఉంది. నాలుగో విడతకు 2018-19 బడ్జెట్‌లో మాత్రం కేవలం రూ. 4,100 కోట్లు మాత్రమే ప్రతిపాదించారు. మొత్తంగా నాలుగయిదు విడతలకు కలిపి రూ.8,200 కోట్ల వరకూ అవసరం ఉంది. మరోవైపు పాత బకాయి రూ.500 కోట్ల ఉండనే ఉంది. మరోవైపు పాత బకాయి రూ. 500 కోట్ల ఉండనే ఉంది. వడ్డీతో కలిపి చివరి రెండు మాఫీ వాయిదాలను ఒకే దఫా చెల్లించాలంటే రూ.9 వేల నుంచి 10 వేల కోట్లు అవసరం కానున్నాయని ఇటు రైతులు, ప్రతిపక్ష నేతలంటున్నారు.

**రైతుల్లో ఆందోళన**

ఇప్పటికే అన్ని విధాలుగా కుదులైపోతున్న రైతన్నలు ఇటీవల కురిసిన అకాల వర్షాలతో మరింతగా ఆర్థిక నష్టాలకు గురవుతున్నారు. ఇటువంటి కష్ట సమయంలో సీఎం చంద్రబాబునాయుడు మిగిలిన నాలుగైదు విడతలు రుణమాఫీ చేస్తే కొంత వరకయినా ఆర్థికంగా మేలు కలుగుతుందని ఆశిస్తున్నారు. 2018-19లో నాలుగైదు విడతలకు కావాల్సిన నిధులు కేటాయించకపోవడం, సాధారణ ఎన్నికలు సమీపిస్తుండడం వంటి అంశాలతో రైతుల రుణమాఫీ పూర్తిస్థాయిలో అమలుపై వారిలో సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇచ్చిన హామీని చంద్రబాబు నిలబెట్టుకోవాలని రైతులు, రైతు సంఘాల ప్రతినిధులు డిమాండు చేస్తున్నారు.

# అల్లాహ్...మాకు శాంతిని ప్రసాదించండి...

(ఈనెల 16 నుంచి రంజాన్ మాసం ప్రారంభం సందర్భంగా)



ఒకప్పుడు సిరిసంపదలతో విరాజిల్లిన ముస్లిం దేశాలు ప్రస్తుతం శవాల గుట్టలు, శిధిలాల పోగులతో పాడుపడిపోయి ఉన్నాయి. కన్నబిడ్డలు యుద్ధంలో గాయపడి తల్లిదండ్రుల చేతుల్లోనే ప్రాణాలు విడవడం, కళ్లముందే తమ తల్లిదండ్రులు ప్రాణాలు కోల్పోతుంటే అనాథలుగా మారిన పిల్లలు.. భీతిగొలిపే యుద్ధక్షేత్రాలు ప్రజలను కాందీశీకులుగా మార్చాయి. మహిళలు, పిల్లలు, తండ్రులు వేదన చెప్పలేము. ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని యుద్ధ ప్రాంతాల నుంచి కట్టుబట్టలతో వెళుతుంటే ఐక్యరాజ్యసమితి కూడా ఏం చేయలేని నిస్సహాయంగా ఉండిపోయింది. ఏ దేశం వారికి స్థానం కల్పించకపోవడంతో దిక్కుతోచని స్థితిలో ప్రజలు అల్లాడుతున్నారు.

వనరులు పుష్కలంగా ఉన్న తూర్పు మధ్య ఆసియాదేశాలపై అగ్రరాజ్యం అమెరికా కన్ను పడింది. చౌకగా వనరలను కొట్టేందామనుకున్నారు. ఇరాక్ అధినేత సద్ధాం హుస్సేన్ అడ్డుకున్నారు. మా చమురుకు రేట్లు మేమే నిర్ణయిస్తామన్నాడు. ఏయ్.. మీకు సాంకేతికతను అందిస్తున్నామన్నారు. మీ సాంకేతికతకు మీరు చెప్పిన రేట్లు మేము చెల్లిస్తున్నప్పుడు మా వనరులపై మీ పెత్తనమేంటని ప్రశ్నించారు. పక్కనున్న ఇజ్రాయిల్‌ను రెచ్చగొట్టారు. దీంతో యుద్ధం మొదలైంది. ఒకట్రెండు సార్లు అతనిదే పైచేయి అయ్యింది. ఇది గమనించిన అగ్రదేశం అతనిపై ప్రపంచ దేశాలను రెచ్చగొడుతూ రసాయినిక ఆయుధాలు సమకూర్చుకున్నాడన్న పేరుతో మిత్ర దేశాలైన బ్రిటన్, ఫ్రాన్స్‌లతో కలిపి యుద్ధం ప్రకటించాడు. తన శక్తినంతా ధారపోసి యుద్ధాన్ని అడ్డుకుందామన్నా కుదరలేదు. జార్జిడబ్ల్యు బుష్ కక్షకట్టి భీకర సైన్యంతో యుద్ధానికి దిగాడు. సద్ధాం పారిపోయి నేలమాళిగలో తలదాచుకుంటుండగా అమెరికా సైనికులు ఆయన్ను పట్టుకొని ఆయనను చిత్రవధ పెట్టారు. ప్రపంచ యుద్ధ ఖైదీల హక్కులను కూడా కాలరాసి,ఉరివేసి చంపివేశారు. అప్పటి నుంచి ఆ దేశం శాంతి భద్రతలను కోల్పోయింది. ముడి పెట్రోలును లక్షల గేలన్లను ఇక్కడి నుంచి తరలించింది. ఇంతకీ రసాయినిక ఆయుధాలున్నాయని చెప్పారుకదా అవి ఎక్కడ అని ఒక్క దేశం కూడా పట్టుపట్టి గట్టిగా అడగలేదు. అంతేకాదు దాని పక్కనున్న దేశాలు కూడా అమెరికా అత్యాశకు బలైపోయాయి. ఈ పరిస్థితుల్లో అమెరికాపై ముస్లిం యువత కక్షకట్టారు. అందుకు బిన్ లాడెన్ నాయకత్వంలోని అల్‌ఖైదా ఉగ్రవాదులు అమెరికాలోని వరల్డ్ ట్రేడ్ సెంటర్ పై ఆత్మాహుతి దాడి జరిపారు. దీంతో మరింత పెట్రేగిపోయిన అమెరికా పక్కనున్న దేశాలపై కూడా కక్ష కట్టింది. ఫలితం అన్ని దేశాల్లోనూ తిరుగుబాటు దార్లు ప్రభుత్వంపై విరుచుకుపడుతున్నారు. టర్కీ, లిబియా, యెమన్‌లు ధ్వంసం అయిపోయాయి. సిరియా ఇంకా కొన ఊపిరితో యుద్ధం చేస్తూనే ఉంది. అమెరికా తిరుగుబాటుదారులకు మద్దతుగా సైన్యం, సాధారణ పౌరులపై బాంబులు కురిపిస్తూనే ఉంది. ఆయా ప్రాంతాల్లో ఆహారం, మందుల సరఫరా కూడా అడ్డుకుంటోంది.

మన పొరుగు దేశమైన మయన్మార్‌కు వస్తే అక్కడ రొహింగ్యాలను బౌద్ధులు ఊచకోత కోస్తున్నారు. దీనివెనుక గ్లోబలైజేషన్ మహమ్మారి కూడా ఉందని కథనాలు ఉన్నాయి. అతిపేదలు నివసించే ఆ ప్రాంతంలో ఖనిజ సంపద నిక్షిప్తమైందని దాన్ని స్వాధీనం చేసుకుంటానికి వారిపై మారణకాండ జరుపుతున్నారని పత్రికలు ఘోషిస్తున్నాయి. దాడులు తట్టుకోలేక రొహింగ్యాలు అరచేతిలో ప్రాణాలు పెట్టుకొని ప్రజలు పక్కనున్న దేశాలకు వలసలు పోతుంటే ఐక్యరాజ్యసమితి ఆదేశాలను కూడా పాటించకుండా ఆయా దేశాలు వారిని వెనక్కు పంపుతున్నాయి. ప్రపంచ నోబుల్ శాంతి బహుమతి పొందిన అంగ్‌సాన్ సుకీ నేతృత్వంలోనే జరుగుతున్న దారుణ మారణకాండ ఇది.

మన దేశానికి వస్తే ఇక్కడ ముస్లిం అనే పదం వినిపిస్తేనే విదేశీయుడి కింద లెక్కవేస్తారు. వారి దేశభక్తికి ఏమాత్రం గౌరవం లేదు. వారు ఏం మాట్లాడినా ప్రభుత్వానికి, జాతికి వ్యతిరేకంగానే భావిస్తారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఆహారంపై ఆంక్షలు ఉన్నాయి. బీజేపీ మద్దతుదారులైన ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీ, ఇతర హిందూ సంస్థలు జరిపే దౌర్జన్యాలకు అడ్డుఅదుపు లేకుండా పోయింది. గుజరాత్ ముఖ్యమంత్రిగా 2000 మంది ప్రాణాలను హరించారన్న అపవాదును మోస్తున్నవారిని, మతం పేరుతో దేశాన్నివిడదీసి, ప్రధానులుగా మారితే దేశంలో అందరికీ సమాన ప్రాతినిధ్యం అందుతుందనుకోవడం అత్యాశే.. కాశ్మీర్ రావణ కాష్ఠంలా కాలుతూనే ప్రతిరోజు భద్రతాదళాలకు, ప్రజలకు మధ్య ఘర్షణ కొనసాగుతూనే ఉంది. ఆ రాష్ట్రానికి ఉన్న స్వయం ప్రతిపత్తిని తీసివేస్తామని బీజేపీ హెచ్చరిస్తూనే ఉంది. (దానిపై వచ్చేవారం సమగ్రంగా వివరాలు అందిస్తాం.) అందుకే ఈ రంజాన్‌ను ప్రపంచ ముస్లింల కన్నీళ్లు తుడిచేదిగా, వారికి శాంతి సౌభాగ్యాలు ప్రసాదించాలని అల్లాహ్‌కు హృదయ పూర్వకంగా, కన్నీళ్లతో దువా (ప్రార్థన) చేద్దాం.

– బోస్

## ముస్లింలంటే ఎందుకింత ద్వేషం ?





ఎడారి మనుషులన్నారు,తురకలన్నారు,అత్తరు సాయిబులన్నారు..
ఎన్ని పేర్లతో పిలిచినా సంతృప్తి దొరకలేదేమో ఆఖరికి ఉగ్రవాదులంటూ
నరరూప రాక్షసులని ప్రపంచమంతా చాటింపు వేస్తున్నారు.
ఎవరేమన్నా...ఏమనుకున్నా తమలో తామే ఏడుస్తూ
అల్లాహ్‌తో బాధను చెప్పుకున్న సందర్భాలే ఎక్కువ...
ప్రతిరోజు దైవసన్నిధిలో గడిపేది ఈ ముస్లీములే..
దైవ గ్రంధాన్ని చదివేదీ ముస్లీంలు మాత్రమే..
అత్యంత క్రమశిక్షణతో
నిబద్ధతో జీవించేదీ ఈ ముసల్మాన్లే కదా..
బౌద్ధులు, హిందువులు,క్రైస్తవులు అని తేడా లేకుండా
మాపై ఆయుధాలెత్తుతారెందుకు..?
నల్లని బురఖా వెనుక వెక్కి వెక్కి ఏడ్చిన
మా కళ్ళను వాళ్ళెప్పుడూ చూసుండరు..
రంగుల బట్టల్లో రాజసంగా తిరిగేవాళ్ళకీ
నలుపు,తెలుపు వస్త్రాలు ధరించే ప్రజల సమానత్వపు
నిరాడంబరత్వం అర్థమౌతుందా..
అర్థనగ్న దుస్తుల్లో తిరిగేవారికి, నిండుగా వస్త్రాలు ధరించే వారి
నాగరికత అర్థమౌతుందా...
మేం పుట్టిన మట్టిమాది కాదంటున్నారు..
కానీ ఈ మట్టి పై నవాబుల నిర్మాణాలే దేశ పాలనకు గతి అయ్యాయి.
మా నాయకుడు బూట్లు వేసుకుని జెండావందనం చేస్తే మహాతప్పు..
కానీ దేశ ప్రధాని మాత్రం జాతీయజెండాతో చెమట తుడుచుకోవచ్చు.
ముస్లీంల కష్టాలు పట్టని దేశంలో
ముస్లీంల ఆకలికేకలు అర్థం కాని దేశంలో
ముస్లీంల మసీదులు కూల్చే దేశంలో
ముస్లీంలను ఉగ్రవాదులని హింసించే దేశంలో
మా దేశ భక్తి మాత్రం
మొహర్రం మాతంలో కోసుకున్న గాయాల రక్తంలా వ్యర్థమైపోతోంది.
బాధ మాత్రం మా మనసుని వేధిస్తూనే ఉంటుంది.
ఈ భారత భూమి పై నల్లటి నింగిలో మెరిసే నెలవంకను చూస్తూ
ఈ నేల పై మానవత్వం,
పరమత సహనం,దేశ ప్రజల్లో ఐకమత్యపు ఆలోచనలు రావాలనీ
మనసులో ప్రార్థించుకుంటూనే ఉంటాం...




## 'మహానటి'కి ఎన్నికష్టాలో...

మహానటి సినిమాకు విశేష ఆదరణ వస్తోంది. ఈ సినిమాలో నటీనటులు కాకుండా ఆయా పాత్రలు మాత్రమే అందరికీ కనిపించాయి. సావిత్రి జీవితంలో జనాలకు తెలియని కొన్ని విషయాలు కూడా వెలుగులోకి వచ్చాయి. ఇవి కొంతమందికి గతంలోనే తెలిసినా.. ఇప్పుడు సినిమా ద్వారా మరింతగా అప్పటి పరిస్థితులు చేరువ అయ్యాయి. జీవిత చరమాంకంలో ఆ మహానటి పడిన కష్టాలు వర్ణనాతీతం. వాటిని చూపిన తీరు.. కీర్తి సురేష్ అభినయం.. సమంత కథచెప్పిన తీరు అన్నీ బాగున్నాయి. కానీ సావిత్రి లాంటి నటీమణి కష్టాలు పడుతుంటే.. తెరపై చూస్తున్న ప్రేక్షకులకే గుండె తరుక్కుపోయింది. చాలామంది ప్రేక్షకులు థియేటర్లలోనే ఏడ్చేస్తున్నారు. పైకి ఏడవలేని వాళ్లు కన్నీరును ఉగ్గబట్టుకుంటున్నారు. అయితే.. సావిత్రి అంతటి కష్టాలు పడుతుంటే ఇండస్ట్రీ జనాలు ఏం చేస్తున్నారనే ప్రశ్న ఇప్పుడు చాలామందిని వేధిస్తోంది. ఆమెతో నటించిన పలువురు దిగ్గజ నటులు.. సావిత్రి చరమాంకంలో ఉన్నపుడు వెండితెరపై వెలిగిపోతూనే ఉన్నారు. వీరిలో ఒక్కరంటే ఒక్కరు కూడా సావిత్రికి సాయం చేయకపోవడానికి ముందుకు రాకపోవడం నిజంగా ఆశ్చర్యం కలిగించే విషయమే. పెద్ద హీరోలు అనే పేరు గుర్తింపు మాత్రమే ఉంటే సరిపోదు.. కాసింత పెద్ద మనసు కూడా చేసుకుని ఉంటే.. అంతటి మహానటి తన చివరి కాలంలో అన్ని కష్టాలు పడాల్సిన అవసరం ఉండేది కాదు అనుకుంటున్నారు జనాలు అయితే ఆమె కోసం ఎంతో శ్రమకోర్చి సన్మానాన్ని ఏర్పాటు చేసింది కామెడియన్ రాజబాబు.. ఆమె కోసం ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమానికి ఆమె మీద అభిమానులంతా వచ్చి తమ శక్తికొద్దీ సాయం చేశారు. అయితే ఈ బడా హీరోలెవరూ పట్టించుకోలేరు. వాణిశ్రీ ఆ కార్యక్రమానికి వచ్చి తన మెడలోని నెక్లెస్‌ను ఆమెకు అలంకరించారని ఆనాటి పెద్దలు చెబుతున్నారు.

– ఖాన్

# రష్యా సైనిక విన్యాసాలు





### అమెరికాను వణికిస్తున్న 'టెర్మినేటర్'

**మాస్కో :** రెండో ప్రపంచ యుద్ధంలో గెలుపుకు గుర్తుగా నిర్వహిస్తున్న విజయోత్సవ పరేడ్‌లో రష్యా అత్యాధునిక ఆయుధసంపత్తిని ప్రదర్శిస్తోంది. ఈ ప్రదర్శన మే 8,9 తేదీలో రష్యా నిర్వహించింది. 12,500 మంది సైనికులు, 150 రకాల యుద్ధ యూనిట్లు ఈ ప్రదర్శనలో పాల్గొన్నాయి. రెడ్ స్క్వేర్‌లో జరిగే ఈ ప్రదర్శనలో 'కోర్‌సెయిర్' డ్రోన్లతోపాటు మూడు కిలోమీటర్ల దూరంలో శత్రు లక్ష్యాలను చేదించగల నిఘా, విధ్వంసక ఆయుధాలు ఉన్నాయి. ఇవన్నీ ఆరు కిలోమీటర్ల ఎత్తులో ఏకబిగిన 10 గంటలపాటు ఎగర గలగడమే కాకుండా రేడియో ఎలక్ట్రానిక్ యుద్ధ వ్యవస్థలను మోసుకెళ్లగలిగే శక్తిసామర్థ్యాలు కూడా ఉన్నాయి. ఎలాంటి వాతావరణంలోనైనా కిలోమీటరు ఎత్తులో ప్రయాణించి, ఎక్కడైనా తేలికగా దిగగలిగే హెలికాప్టర్ 'కాట్రాన్' ప్రదర్శనలో పాల్గొంది. ఈ యుద్ధ ఆయుధ ప్రదర్శనలో అందరినీ ఆకట్టుకున్న వాహనం 'టెర్మినేటర్'. దీనిలో 30 మిల్లీమీటర్ల పరిమాణంలోని 2ఎ42 వైమానిక ఫిరంగి, ఏజీ 17డీ ఆటోమాటిక్ గ్రేనేడ్ లాంచర్లు, నాలుగు అటకా యాంటీట్యాంక్ మిస్సైల్స్ దీని నుంచి ప్రయోగించవచ్చు. అంతేకాకుండా ఉరాన్ 9 రొబొటిక్‌లో బహుళ ప్రయోజనాల వ్యవస్థ ఉంది. ఆదేశాలు జారీ చేయగానే మూడు కిలోమీటర్ల దూరంలోని శత్రు శిబిరాలను లక్ష్యం చేసుకొని విధ్వంసం సృష్టిస్తుంది. ఈ ఆయుధం అమెరికాకు ముచ్చెమటలు పట్టిస్తోంది. ఈ పరికరంతో నాలుగు రకాల ఆయుధాలను ఏకకాలంలో ప్రయోగించగలడం దీని ప్రత్యేకత. 'ఉరాన్9' కంటే ఆధునిక ఆయుధం 'ఉరాన్ 6' రొబొటిట్ మైనింగ్ స్వీపర్ (మందుపాతరలను నిర్వీర్యం చేయగలదు) ఉంది. దీన్ని సిరియాలో ఉపయోగించారు. ఇంకా 20 సైనిక బ్లాకులు, పదాతి, జల, మిలటరీ పోలీసు, నేషనల్ గార్డులు, అత్యవసర పరిస్థితి మంత్రిత్వశాఖ, కాడేట్లు ప్రదర్శనలో పాల్గొన్నారు. ఇందులో 75 మంది వైమానికి సిబ్బంది తమ ప్రతిభాపాటవాలను ప్రజలకు తెలియచేశారు. అత్యాధునిక సాంకేతికతతో రూపొందిన ఐదవతరం టీయూ 57 యుద్ధ విమానాలు, శత్రుదేశాల విమానాలను అడ్డుకునే మిగ్ 31 కె,శబ్దవేగానికి మించి ప్రయాణించే 'కింజాల్ సూపర్ సోనిక్ ఎయిర్ క్రాఫ్ట్ వీక్షకులను సంభ్రమాశ్చర్యాలకు గురిచేసింది. దీనికి తోడు ఎస్‌యూ 35, ఎస్‌యూ 30 ఎంఎస్, ఎంఐజీ 31, ఎంఐజీ 29, ఎస్‌యూ 34, ఎస్‌యూ 24 ఎం బాంబర్లు, టీయూ 160 , టీయూ 95 ఎంఎస్ మిస్సైల్ లాంచర్లు, టీయూ 22 ఎం3 వ్యూహాత్మక బాంబర్లు, హెలికాప్టర్లు కేఏ 51, ఎంఐ 8 ప్రదర్శనలో ఉన్నాయి.

# ఉద్యోగుల సాంస్కృతిక వికాసానికి చేయూత



**రాజధాని ప్రతినిధి, సచివాలయం :** నిత్యం ఒత్తిళ్లతో విధినిర్వహణలోతలమునకలయ్యే సచివాలయ ఉద్యోగుల ఆరోగ్యాల కోసం ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేకప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రహ్మణ్యం అభిప్రాయపడ్డారు. ఆరోగ్య పరిరక్షణలో భాగంగా ఉద్యోగుల సాంస్కృతిక వికాసానికి చేయూత నిస్తుందన్నారు. సచివాలయంలోని అయిదో బ్లాక్‌లోఉన్న కాన్ఫరెన్స్ హాలులోఇటీవల పదవీ విరమణ పొందిన డాక్టర్ లంక లక్ష్మీనారాయణ, గొల్లపూడి రామ్మోహనరావుకు ఏపీ సచివాలయ సాంస్కృతిక సంఘం ఆధ్వర్యంలో ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఉద్యోగుల వ్యక్తిత్వ వికాసానికి ఈ కార్యక్రమాలు ఎంతోదోహదం చేస్తాయని, తద్వారా ఒత్తిళ్ల నుంచి బయటపడి విధి నిర్వహణలో నైపుణ్యం పెరుగుతుందన్నారు. సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు యు.మురళీకృష్ణ మాట్లాడుతూ, ఉద్యోగులు తరుచూ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అనంతరం పదవీ విరమణ చేసిన డాక్టర్ లంక లక్ష్మీనారాయణ, గొల్లపూడి రామ్మోహనరావును ఎల్వీ సుబ్రహ్మణ్యం దుశ్శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ సచివాలయ సాంస్కృతిక సంఘం సభ్యులు కె.వి.ఎస్.కె.ఎస్.పాపారావు, ఎస్.నాగేంద్రప్రసాద్, డి.స్వర్ణరాజ్, సూర్యకుమారి, చెన్నమ్మ, రమేష్ బాబు, గుమ్మడిప్రేమ్ చంద్, ఆర్.కె.హరినాధ్ బాబు ప్రసంగించారు.

**రాష్ట్రప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రహ్మణ్యం**

**ఆకట్టుకున్న దివ్యాస్ లవ్ స్టోరీ లఘుచిత్రం**

అనంతరం సచివాలయ రిటైర్డ్ అధికారి గుమ్మడి ప్రేమ్‌చంద్ దర్శకత్వంలో ఏపీ సచివాలయ సాంస్కృతిక సంఘం నిర్మించిన లఘు చిత్రం "దివ్యాస్ లవ్ స్టోరీ". ప్రేమ పదానికి నిర్వచనం ఈ లఘు చిత్రం.. పరిణితిలేని ప్రేమ, ప్రేమికుల మధ్య ఆకర్షణ, ఓవర్ పొసెసివ్‌నెస్ వీటిమధ్య ప్రేమికుల మధ్యా ఎరిగిన దూరం విషయాలపైరూపొందించిన చిత్రమిది.ప్రేమంటే యువతీయువకుల మధ్యే కాకుండా, తల్లిదండ్రులు, అన్నదమ్ములు, సోదరీసోదరుల మధ్య కూడా ఉంటుందన్న విషయాన్ని దివ్యాస్ లవ్ స్టోరీ చిత్రంలో చూపడం సభికులను ఆలోజింపచేసింది.












Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/s Vastitude Media Pvt. Ltd., and Printed at M/s Jagati Publications Ltd., Sakshi Press, Survey No. 766/2, Ankireddy Palem Village, Guntur Rural, 522005, Guntur Distt. A.P. and Published at 6-45/1, Rayapudi, Thullur Mandal, Guntur Distt, Andhra Pradesh-522237. Editor: Pattan Hussain Khan, RNI NO: APTEL/2015/66622, Postal Regd No: GTR/84/2016-18, Cell 9440662699, Email : rajadhanivartalu1@gmail.com